సాక్షి తిరుపతి

బుధవారం । 13 । మార్చి । 2024



సంకల్పించా.. నెరవేర్చా

టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఇంటి పట్టాల ప్రొసీడింగ్స్‌ను చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పంపిణీ చేశారు.

- 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

నాయుడుపేట, ఏర్పేడు మండలంలోని టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు.

- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం	సహరీ గురువారం
తిరుపతి	6-26	5-02
గూడూరు	6-27	4-53

న్యూస్‌రీల్

నేడు ముక్కంటి ఆలయ కమిటీ సమావేశం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ సమావేశానికి పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు.

మహిళా వర్సిటీకి మలేషియా విద్యార్థినులు



మలేషియా విద్యార్థినులతో వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీకి మూడు నెలల ఇంటర్న్‌షిప్ కోసం మలేషియాలోని యూఎంకే యూనివర్సిటీకి చెందిన ఐదుగురు విద్యార్థినులు విచ్చేశారు. మంగళవారం ఈమేరకు వర్సిటీ అధికారులు వారికి స్వాగతం పలికారు. వీసీ భారతి మాట్లాడుతూ మలేషియా వర్సిటీతో ఎంఓయూలో భాగంగా విద్యార్థుల ఎక్స్ఛేంజ్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మూడు నెలల ఇంటర్న్‌షిప్‌లో బయో ఇంజినీరింగ్, అగ్రి బయోటెక్నాలజీ, డీఎన్ఏ టెక్నాలజీ, క్లినికల్ బయో కెమిస్ట్రీ, ఇమ్యూనాలజీ వంటి వాటిలో పాటు సైద్ధాంతిక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజినీ, ఇంటర్నేషనల్ డీన్ విజయలక్ష్మి, సువర్ణలతాదేవి పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సీడాప్–డీఆర్‌డీఏ ద్వారా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం (డీడీయూ–జీకేవై)కింద శిక్షణ తీసుకుని వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం మంగళవారం తిరుపతిలోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు 800 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, సీడాప్ చైర్మన్ సాది శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశకుడన్నారు. సీడాప్ ద్వారా 76వేల మందికి శిక్షణ, 52వేల మందికి ఉపాధి కల్పించడం గొప్ప విషయమని కొనియాడారు. మేయర్ శిరీష మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడ్డాయని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, సీడాప్ జేడీఎం సరితారెడ్డి పాల్గొన్నారు.

అల.. అమరావతిలో!

ఎన్నికలు సమీపిస్తున్నా బీజేపీ, టీడీపీ, జనసేనలో అభ్యర్థుల ప్రకటన మరింత ఆలస్యమవుతోంది. అధినాయకులు అమరావతిలో తిష్టవేసి అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందోనని లెక్కలు వేసుకుంటున్నారు. అభ్యర్థుల ప్రకటనపై తుది కసరత్తు జరుగుతోందని తెలుసుకున్న తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, నగరి ఆశావాహులు అమరావతికి పరుగులు పెడుతున్నారు. నోటా ఓట్లతో పోటీపడే నాయకులు సైతం ‘నాదే టికెట్.. నా పేరు ఖరారు చేశారు’అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అది చాలదన్నట్టు బాణసంచా పేల్చుతూ సంబరాల్లో మునిగిపోతున్నారు. మరోవైపు ఇంకో వర్గం నాయకుల అనుచరులు ‘లేదు లేదు.. మా నాయకుడి పేరు ఖరారైందంట’ అంటూ పోటీపడి టపాకాయలు పేల్చుతున్నారు. దీంతో ఎవరికి టికెట్ వస్తుందో.. ఎవరికి రాదో తెలియక ఆయా పార్టీల శ్రేణులు గందరగోళంలో మునిగిపోతున్నారు.



- టీడీపీ, జనసేన ఆశావాహులు అమరావతిలో తిష్ట
- తిరుపతి టీడీపీ నేతలకు తీవ్ర అవమానం
- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని చంద్రబాబు
- తిరుపతి, నగరి టికెట్ కోసం బీజేపీ పట్టు
- శ్రీకాళహస్తిలో కొనసాగుతున్న మూడు ముక్కలాట

సాక్షి, తిరుపతి: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడిగా ఎన్నికలకు వెళ్లేందుకు అనైతిక పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. పొత్తు పెట్టుకున్నాక ఆశావహుల అభ్యర్థుల జాతకాలు మారే ప్రమాదంలో పడ్డాయి. తిరుపతి టికెట్టు జనసేనకు కేటాయించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల తర్వాత బీజేపీతో పొత్తు పెట్టుకున్నాక.. కమలనాథులు తిరుపతి అసెంబ్లీ కావాలని పట్టుబడుతున్నారు. నోటా ఓట్లతో పోటీపడే నాయకుడు ఒకరు టికెట్ తనదేనంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిల్లర వేషాల నాయకుడు ఒకరు.. ‘అదెలా కుదురుతుంది.. టికెట్ మాదే’ నంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కండవాలు మార్చుకునేందుకు సిద్ధం

తిరుపతి జనసేనకే అని తేలిపోవడంతో.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు మరో ఇద్దరు నాయకులు కండువా మార్చుకునేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా వీరు అమరావతి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తిరుపతి టికెట్ టీడీపీకే కేటాయించాలంటూ తీర్మానం చేసి పంపిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అమరావతిలో చంద్రబాబుని కలిసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న చంద్రబాబు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా ఇష్టపడలేదని విశ్వసనీయ సమాచారం. దీంతో టీడీపీలో ఉండి ప్రయోజనం లేదని జనసేనలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా రెండు రోజులుగా అమరావతిలో తిష్టవేసినట్లు ఆమె వర్గీయులు చర్చించుకుంటున్నారు. మరోవైపు టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులు మనుమరాలు, మరొకరు జనసేన తరుపున టికెట్ తమకే ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. నగరి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించి కాషాయం కండువా కప్పుకున్న అశోక్‌రాజు పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. నగరి టీడీపీ అభ్యర్థిగా ఇదివరకే గాలి భానుప్రకాష్ పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తరువాత బీజేపీతో పొత్తు కుదరడంతో అశోక్‌రాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. టికెట్ ఇస్తే పార్టీలో ఉంటాను.. లేదంటే పార్టీ నుంచి వైదొలుగుతానని బీజేపీ పెద్దలకు తేల్చిచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

శ్రీకాళహస్తిలో మూడు ముక్కలాటే..

మూడు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఆశావాహులు శ్రీకాళహస్తి టికెట్ తనకే కావాలంటూ ఓ వైపు బొజ్జల సుధీర్‌రెడ్డి, మరో వైపు కోలా ఆనంద్, ఇంకో వైపు వినూత ఆయా పార్టీ అధినాయకుల వద్ద డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థి తానేనని ఎవరికి వారు ప్రకటించుకోవడంతో శ్రీకాళహస్తిలో ఆ పార్టీ శ్రేణులు బాణసంచాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కొట్లాడుకుంటుంటే.. మరో వైపు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తమ సామాజికవర్గం వారిని వెంటబెట్టుకుని శ్రీకాళహస్తి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. మూడు పార్టీలకు చెందిన ఆశావాహులు ఎవరికి వారు తానే అభ్యర్థి అని అనుచరుల వద్ద చెబుతుండడంతో వారు కూడా తమ నాయకుడికే టికెట్ ఖరారైందని అత్యుత్సాహంతో ప్రచారం చేసుకుంటున్నారు. గత మూడు రోజులుగా ఎవరికి వారు టికెట్ తనకేనని ప్రకటించుకుంటూ బాణసంచా పేల్చుకుంటుండడంతో ఆయా పార్టీ శ్రేణులు గందరగోళంలో పడిపోయారు.

ఇంటర్ పరీక్షలకు 954మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని 87 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 954 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు మొత్తం 33,848మందికి గాను 32,894మంది హాజరైనట్లు వెల్లడించారు. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

బార్బర్ పోస్టులకు దరఖాస్తులు

వెంకటగిరిరూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో కాంటాక్ట్ పద్ధతిలో బార్బర్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కమాండెంట్ పి.ప్రకాష్ మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 16వ తేదీ లోపు కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు.

అప్రమత్తంగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అందరితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచలకిషోర్, నోడల్ ఆఫీసర్లు వి.శేఖర్, కోదండరామిరెడ్డి , సుశీలాదేవి, శ్రీనివాస ప్రసాద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సైకోల పైశాచికానికే గీతాంజలి బలి

- వెల్లువెత్తిన నిరసన
- కొవ్వొత్తులతో ర్యాలీలు

గంగవరం: టీడీపీ సోషల్ మీడియా సైకోల కారణంగా ఒక నిండు ప్రాణం బలైపోయిందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిలో గీతాంజలి అనే మహిళపై ఐ–టీడీపీ సోషల్ మీడియా భారీగా ట్రోల్స్ చేయడంతో మనస్తాపానికి గురైన ఆమె రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే వెంకటేగౌడ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గంగవరంలో మంగళవారం జరిగిన చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమంలో గీతాంజలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మ శాంతించాలంటూ మహిళలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ సైకో నాయకులు క్రూరంగా తయారయ్యారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తనకు జగనన్న ఇల్లు ఇచ్చారు.. ఇంటి పట్టా ఇచ్చి ఆదుకున్నారు.. అంటూ గీతాంజలి సంతోషం వ్యక్తపరిచారని, పేదల కోసం ఇంత చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని, అభిమానాన్ని మీడియా ద్వారా చాటుకున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ట్రోల్స్ చేయడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. తమతో పెట్టుకుంటే అందరికీ ఇదే గతి పట్టిస్తాం అంటూ నారా లోకేష్ ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.



శ్రీకాళహస్తిలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి



అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

కొవ్వొత్తులతో నిరసన

శ్రీకాళహస్తి: తెలుగుదేశం, జనసేన సోషల్ మీడియా కార్యకర్తల వేధింపులతోనే మనోవేదనకు గురై గీతాంజలి ఆత్మహత్య చేసుకుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి తీవ్రంగా స్పందించారు. గీతాంజలి మృతికి నిరసనగా పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన సోషల్ మీడియా బరితెగించి ఒక మహిళ అని చూడకుండా అసభ్యంగా ట్రోల్ చేయడంతోనే ఆమె మనస్తాపానికి గురైందన్నారు. మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, సిరాజ్‌బాషా, నాని, కంఠా ఉదయ్‌కుమార్, టైలర్ శ్రీను, కొల్లూరు హరినాయుడు, ఫజల్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఏ సమాధానం చెబుతాయి

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ, జనసేన ట్రోల్స్ బారినపడి ప్రాణాలు కోల్పోయిన గీతాంజలికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, మేయర్ అముద మాట్లాడారు. సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం ఇస్తే వాటిని ఆనందంగా చెప్పుకోవడమే ఆమె చేసిన తప్పుగా టీడీపీ సైకోలు చిత్రీకరించడం దారుణమని మండిపడ్డారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన దువ్వూరు


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దువ్వూరు

దొరవారిసత్రం: తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం సూళ్లూరుపేట చెంగాళమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దువ్వూరు బాలచంద్రారెడ్డి, మంత్రి పెద్దిరామచంద్రారెడ్డితోపాటు సీఎంను కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని దువ్వూరు సీఎంకు తెలిపారు.

జర్నలిస్టుల ఇంటి పట్టాల ప్రక్రియ వేగవంతం


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : అర్హులైన జర్నలిస్టులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం తహసీల్దార్లు, ఆర్డీఓలు స్థలాలు గుర్తించాలన్నారు. జేసీ శుభం బన్సల్, నోడల్ అధికారి కోదండరామిరెడ్డి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సంకల్పించా.. నెరవేర్చా

- ఉద్యోగుల కోసం ఆ శ్రీవారే నా భుజం తట్టారు
- వారి కలలు సాకారం.. నా జీవితం ధన్యం
- 9 వేల మంది ఉద్యోగులు.. పెన్షనర్లకు ఇంటి స్థలాలు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఇది సాధ్యం
- ఇంటి పట్టాల పంపిణీలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



విశ్రాంత ఉద్యోగులకు ఇంటి పట్టాల ప్రొసీడింగ్స్ అందిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, హాజరైన ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): ప్రపంచంలో ఎక్కడా.. ఎన్నడూ జరగని విధంగా ఇంత తక్కువ వ్యవధిలో తాను సంకల్పించినట్లుగా టీటీడీలో పనిచేస్తున్న 9 వేల మందికి పైగా ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో తన జీవితం ధన్యమైందని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ పండుగ కార్యక్రమంలో చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి 4 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఇంటిస్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పదహారేళ్ల క్రితం తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆదేశాలతో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించామన్నారు. తన పదవీకాలం ముగిసిన తర్వాత ఇళ్ల స్థలాల కేటాయింపు నిలిచిపోయిందని తెలిపారు. శ్రీవేంకటేశ్వరుని కరుణ, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రెండోసారి తనకు టీటీడీ చైర్మన్‌గా అవకాశం వచ్చిందని, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకే స్వామివారు తన భుజం తట్టినట్టుగా భావిస్తున్నానని తెలిపారు. వడమాలపేట, పాదిరేడు వద్ద రెండు విడతల్లో 432 ఎకరాల్లో 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. ప్రస్తుతం ఏర్పేడు మండలం పల్లం వద్ద ఉద్యోగులకు, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు కలిపి 4 వేల మందికి ఇంటి స్థలాలు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. మిగిలిపోయిన ఉద్యోగులు, పెన్షనర్లకు కూడా తప్పకుండా ఇంటి స్థలాలు కేటాయిస్తామని తెలియజేశారు.

ఇళ్ల స్థలాలపై దుష్ప్రచారాన్ని నమ్మకండి

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ వడమాలపేట, పల్లం ప్రాంతాల్లో టీటీడీ ఉద్యోగులకు, పెన్షనర్లకు కేటాయించిన ఇంటి స్థలాలకు సంబంధించి కొన్ని పత్రికలు, కొందరు వ్యక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. వడమాలపేట వద్ద రెండు విడతల్లో ఉద్యోగులకు ఇంటి స్థలాలకు సంబంధించి లేఅవుట్, ప్లాట్ నంబర్లు వేసి, డిప్ తీసి ప్రొసీడింగ్స్ అందించామన్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందు కోసం రూ.150 కోట్లు వెచ్చించామన్నారు. ఏర్పేడు మండలం పల్లం గ్రామం వద్ద 400 ఎకరాలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసేందుకు రూ.90 కోట్లు వెచ్చించామని, 320 ఎకరాలను ఇప్పటికే జిల్లా అధికారులు టీటీడీకి స్వాధీనం చేశారని చెప్పారు. స్వాధీనం చేసుకున్న స్థలంలో ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయిస్తూ ప్రస్తుతం ప్రొసీడింగ్స్ ఇస్తున్నామని, వెంటనే ప్లాట్ నంబర్లు వేసి, డిప్ తీసి ఉద్యోగులకు కేటాయిస్తామని వివరించారు. ఇక్కడ 4వేల మందికి ఇంటి స్థలాల కేటాయిస్తున్నామని తెలియజేశారు. 2015 వరకు చేరిన రెగ్యులర్ ఉద్యోగుల్లో 800 మంది, పెన్షనర్లు 1,780 మంది ఇంకా మిగిలారని చెప్పారు. త్వరలోనే మిగిలినవారికి ఇంటి స్థలాలు కేటాయిస్తామని తెలియజేశారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ స్నేహలత, ఇతర అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ దయతోనే పట్టాలు


నేను టీటీడీలో గ్రంథాలయాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందాను. ఎన్నడూ ఏ ప్రభుత్వమూ మా సంక్షేమం కోసం పట్టించుకున్నది లేదు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కృషితో విశ్రాంత ఉద్యోగులకూ ఇంటి పట్టాలు అందిస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది.
– యువరాజేశ్వరి, టీటీడీ రిటైర్డ్ లైబ్రేరియన్


నాలుగు తరాలకు సాయం అందించారు


టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఇంటి పట్టాలు అందించడం సంతోషకరం.నేను తెలుగు పండిట్‌గా పద్మావతి బాలికల హైస్కూల్, ఓరియంటల్ కాలేజ్, ఎస్‌జీఎస్ హైస్కూళ్లలో పనిచేశాను. 2009లో రిటైర్డ్ అయ్యాను. అయినా నేడు నాకు ప్రొసీడింగ్స్ అందించడం చాలా ఆనందంగా ఉంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మంలకు కృతజ్ఞతలు. ఉద్యోగులందరూ రుణపడి ఉంటారు.
– బి.పద్మావతి, టీటీడీ రిటైర్డ్ తెలుగు పండిట్

కరుణాకరరెడ్డికి రుణపడి ఉంటాం


టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి రుణపడి ఉంటాం. 2010 వరకు టీటీడీలో డ్రైవర్‌గా పనిచేశాను. ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వాలు ఏవీ పట్టించుకోలేదు. కేవలం కరుణాకరరెడ్డికి మాత్రమే ఇది సాధ్యం. ఆయన తలపెట్టిన కార్యాన్ని మళ్లీ నెరవేర్చారు. రిటైర్డ్ ఉద్యోగులను సైతం గుర్తించి వారికి సాయంగా పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి, చైర్మన్‌కు, ఈవో, జేఈవోలకు కృతజ్ఞతలు.
– కన్నయ్యరెడ్డి, టీటీడీ రిటైర్డ్ డ్రైవర్

ఇంటి స్థలం మా జీవితానికి భరోసా


30 ఏళ్ల పాటు ఎదురుచూసిన ఆనంద క్షణాలు ప్రస్తుతం ఆవిష్కృతమయ్యాయి. టీటీడీ చైర్మన్‌తోపాటు అధికారులను జీవితాంతం గుర్తుంచుకుంటాం. ఇంటి స్థలాలు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి, ఈవో ఏవీ ధర్మారెడ్డికి, జేఈవో వీరబ్రహ్మంకు ప్రత్యేక కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరెవ్వరికీ ఇది సాధ్యం కాదు.
– రామచంద్రారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

సకల భాషలకు మూలం.. సంస్కృతం


మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

తిరుపతి సిటీ : ప్రపంచంలోని సకల భాషలకు మూలం సంస్కృతమేనని, అది సంస్కరించబడిన భాషగా విరాజిల్లుతోందని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి తెలిపారు. మంగళవారం తిరుపతి జాతీయ సంస్కృత యూనివర్సిటీలో భారతీయ భాషా సమ్మేళనం అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సంస్కృతాన్ని నిశితంగా అధ్యయనం చేస్తేనే అన్ని భాషలను నేర్చుకోగలమన్నారు. తనకు సంస్కృతం అంటే పిచ్చి ప్రేమ అని, భాషలో పద్యాలు, సాహిత్యంలో భక్తిరంజకమైన చమత్కారాలు ఉంటాయని వెల్లడించారు. సంస్కృతం మృత భాషకాదని, అది అమృత భాష అని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఉన్నత విద్యనందించే వర్సిటీలు మాతృభాషాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నాయని ప్రశంసించారు. భాషాభివృద్ధికి సంస్కృత వర్సిటీ ఎన్నో కార్యక్రమాలు, ప్రచారం చేపట్టడం అభినందనీయమన్నారు. సంస్కృతాన్ని తెలుగు భాష పోలి ఉంటుందని చెప్పారు. తెలుగు, సంస్కృతంలో పద్యాలు, కావ్యాలు ఆలపిస్తుంటే శరీరంలోని 72వేల నాడులు కదులుతాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సాంకేతిక, సాంస్కృతిక, సంగీత అంశాలతో భాష ముడిపడి ఉంటుందని, జీవ భాషగా తెలుగు పరిఢవిల్లుతోందన్నారు. అనంతరం చలోక్తులతో కూడిన పద్యాలు, కావ్యాలను ఆమె అనర్గళంగా వినిపించడంతో ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. ఈక్రమంలో లక్ష్మీపార్వతిని వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. సదస్సులో వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని 50 టీడీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ముని మోహన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, కౌన్సిలర్ కావేరిపాకం అశోక్, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కిషోర్ యాదవ్, పొట్లాపూడి రాజేష్, చదలవాడ కుమార్ పాల్గొన్నారు.


టీడీపీ నేతలకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ఏర్పేడు : బండివానిపల్లెలో వంద మందికి పైగా టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.


సత్యవేడు : పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న రాజేష్


గూడూరు : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్


నాయుడుపేట : వైఎస్సార్‌కు జోహార్లర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సంక్షేమ శకం.. 'ఆవిర్భావం'


వెంకటగిరి : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర చరిత్రలో సంక్షేమ శకం ఆవిర్భవించిన రోజు.. పేదల పక్షాన నిలబడి పోరాడే పార్టీ పురుడుపోసుకున్న రోజు.. పెత్తందార్ల నిరంకుశత్వాన్ని నిలువరించే వైఎస్సార్‌సీపీ అడుగుపెట్టిన రోజు.. 14 ఏళ్ల క్రితం మహోజ్వలంగా ప్రారంభమైన రోజు ఇదే. – సాక్షి, తిరుపతి

గిరి ప్రదక్షిణం.. జన సంద్రం


అశేష భక్తజనంతో కొండచుట్టుకు వెళుతున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జ్ఞానప్రసూనానాంబ సమేత వాయులింగేశ్వరస్వామివారి గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలు, రుషులకు పార్వతీ పరమేశ్వరులు ఘనంగా వీడ్కోలు పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ఆదిదంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా చప్పరాలపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చి కొండ చుట్టుకు సాగనంపారు. ఈ క్రమంలో రాజగోపురం నుంచి చతుర్మాడవీధుల్లోకి శివపార్వతులు ప్రవేశించారు. బేరివారి మండపం వద్ద బేరి కులస్తులు అందించిన నాగవల్లిని అమ్మవారికి అలంకరించారు. అనంతరం జయరామారావువీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగు గంగకాలనీ, కై లాసగిరికాలనీ, రాజీవ్‌నగర్ మీదుగా గిరిప్రదక్షిణ ముందుకు సాగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్ద స్వామిఅమ్మవార్లు విశ్రాంతి కోసం కాసేపు విశ్రమించారు. అక్కడ ఆదిదంపతులకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయం, దాతల ద్వారా అన్నప్రసాదాలు వితరణ చేశారు. అంజూరు మండపం నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులు, భక్తులు స్వాగతం పలికారు. కార్యక్రమానికి ఉభయకర్తలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు.బియ్యపు శ్రీవాణిరెడ్డి, పవిత్రారెడ్డి, ఆకర్ష్ రెడ్డి పాల్గొన్నారు

అశ్వ, సింహవాహనాలపై ఆది దంపతులు

కై లాసగిరి ప్రదక్షిణ అనంతరం స్వామి, అమ్మవారు ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అశ్వ, సింహవాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఆదిదంపతులు ఎదుట ఎమ్మెల్యే, తదితరులు


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

చరిత్ర సృష్టించేలా అభివృద్ధి


అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ గురుమూర్తి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(. సైదాపురం): వెంకటగిరిలో చరిత్ర సృష్టించేలా అభివృద్ధి చేసి చూపించామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో రూ.9.50 కోట్లు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రూ.1.45 కోట్ల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. వెంకటగిరిని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఏర్పేడు నుంచి పెంచలకోన వరకు ఎంపీ సహకారంతో నాలుగు లేన్ల రహదారి నిర్మించి, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని తెలిపారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు దొంతు శారద, పార్టీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలయ్య, ఉమా మహేశ్వరి, విప్ లక్ష్మి, ధనియాల రాధ, నేతలు చిట్టేటి హరికృష్ణ, ఎల్.కోటేశ్వరరావు తోట గణేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో 'జన ఔషధి'


జన ఔషధి కేంద్ర వద్ద ఎంపీ గురుమూర్తి, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(అలిపిరి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జన ఔషధి కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జన ఔషధిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ కేరళలోని కొల్లాం నుంచి తిరుపతికి ప్రత్యేక రైలును ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్, సామంచి శ్రీనివాస్, మల్లకుప్పం శేఖర్, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ శ్రీహరావు, పాటిబండ మురళి, ప్రభాకర్ నాయుడు, జనార్ధన్‌రెడ్డి, కవిత, అనూష , తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పీసీ రాయల్ పాల్గొన్నారు.

ఆరుగురు ఎర్రదొంగల అరెస్ట్

చంద్రగిరి : భాకరాపేట అటవీ ప్రాంతంలోకి గొడ్డళ్లు, రంపాలతో చొరబడిన ఆరుగురు ఎర్రదొంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ఐ మహేశ్వర నాయుడు బృందం మంగళవారం తెల్లవారుజామున కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొంతమంది తారసపడ్డారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టబడిన వారిలో సత్యసాయి జిల్లాకు చెందిన ఆనేవాళ్ల హరి (43), తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన మురుగయ్య (27), తమిళనాడులోని కళ్లకురిచ్చికి చెందిన వేల్‌మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేశన్ (30) ఉన్నారు. తప్పించుకున్న మరో ఆరుగురి కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేసును సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక్క కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.